క్లుప్తంగా

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయాలి

గూడెంకొత్తవీధి/చింతపల్లి రూరల్ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ఉత్సవాలను జీకే వీధి, చింతపల్లి మండలాల్లో సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ జీకే వీధి మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, చింతపల్లి ఎంపీపీ అనూషదేవి ఆదివారం వేర్వేరుగా తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీ సభ్యులు మండల కన్వీనర్లు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. చింతపల్లిలో జరిగే కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్టు అనూషదేవి పేర్కొన్నారు.

విద్యార్థులకు పలకలు, పెన్నుల పంపిణీ



ఎంపీటీసీతో కలిసి పలకలు,పెన్నులు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

కొయ్యూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న దుమంతి సత్యనారాయణ ఆదివారం కొయ్యూరు పంచాయతీ చింతవానిపాలెంలో ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న 22 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు,పెన్సిళ్లు,పలకలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను విధిగా తల్లిదండ్రులు బడికి పంపించాలని కోరారు. గిరిజనులు విద్యలో రాణించాలన్నారు. ఎంపీటీసీ కె.మల్లికార్జున్ మాట్లాడుతూ ఇక్కడ విద్యార్థులకు సత్యనారాయణ పెన్నులు, పుస్తకాలు సమకూర్చడం ఆనందంగా ఉందన్నారు.

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం



పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గంతో సంఘ సభ్యులు

అరకులోయటౌన్: అరకులోయ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని స్థానిక పర్యాటక శాఖ మయూరి హిల్ రిసార్ట్స్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వి.ప్రసాద్‌పాల్, కార్యదర్శిగా బి.ఇ.సంజీవ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పి.సద్రక్, సంయుక్త కార్యదర్శిగా వి.ప్రదీప్, కోశాధికారిగా కె.శామ్యూల్, గౌరవ అధ్యక్షుడిగా వి.ప్రభుదాస్, కన్వీనర్‌గా కె.ఎస్. బాబూరావు, సభ్యులుగా మరో ఐదుగురు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌పాల్, సంజీవ్ కుమార్‌లు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు.

వ్యవసాయ పరికరాలు సిద్ధం చేస్తున్న రైతులు



ఇనుప పనిముట్లను సరిచేస్తున్న కమ్మరి పనివారు

కొయ్యూరు: వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన రైతులు పరికరాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఆదివారం కొయ్యూరులో జరిగిన సంతకు తమ వద్ద ఉన్న పనిముట్లను తీసుకువచ్చి బాగుచేయించుకున్నారు. పాడైనకత్తులు, గొడ్డళ్లు, గునపాలు, పారలను సరిచేయించుకున్నారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు కమ్మరి పనివారు రైతుల పనిముట్లను బాగుచేశారు.

మలేరియా నివారణకు చర్యలు

సీలేరు: పంచాయతీ కేంద్రం సీలేరులో మలేరియా నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతుండడంతో వీధుల్లో వర్షంనీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందాయి. ఎంపీడీవో ఆదేశాల మేరకు సీలేరు కార్యదర్శి వి.శ్రీనివాసు, సర్పంచి దుర్జో ఆధ్వర్యంలో వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయడంతో పాటు ఫాగింగ్ నిర్వహించారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్...

- ప్రత్యేక ఆకర్షణగా 'రైలు' బడి
- విద్యార్థులను ఆకట్టుకునేలా లంగుపర్తి గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల
- హెచ్‌ఎం పట్టాసి ప్రసాదరావు ప్రత్యేక చొరవ

లంగుపర్తిలో రైల్వేస్టేషన్ లేదు. అయితే అక్కడ నిత్యం రైలు కనిపిస్తుంది. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా అందులోకి వెళతారు. అదే రైలు బడి. అంటే రైలు బోగీలలా తరగతి గదులున్న పాఠశాల...విద్యార్థులను ఆకట్టుకునేలా ఈ పాఠశాలను తీర్చిదిద్దారు. సాధారణంగా పిల్లలకు రైలు ప్రయాణమంటే ఎంతో సరదా. అందుకే అచ్చం రైలులా పెయింటింగ్ వేసిన ఈ ఆశ్రమ పాఠశాలలో చదివేందుకు ఇప్పుడు విదార్థులు ఆసక్తి చూపుతున్నారు.



రైలు బోగీల రంగులతో తరగతి గదులు



ప్లాట్‌ఫారంపై రైలు ఆగినట్టు కనిపిస్తున్న లంగుపర్తి ఆశ్రమ పాఠశాల భవనం

అనంతగిరి: మండలంలోని లంగుపర్తి పంచాయతీ కేంద్రంలోని ఉన్న ఈ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల మండలానికే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గతంలోని పలు సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఈ పాఠశాల నేడు అన్ని సౌకర్యాలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతోంది. ఆశ్రమ పాఠశాలే అయినప్పటికీ గతంలో సౌకర్యాల కొరత కారణంగా ఇక్కడ చదివేందుకు విద్యార్థులు మొగ్గుచూపేవారు కాదు.. ఎలాగైనా పాఠశాలలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రధానోపాధ్యాయుడు పట్టాసి ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలను రైలు తరహాలో అద్భుతంగా తీర్చిదిద్దారు.. పాఠశాలలోని 120 వరకు ఈ ఏడాది విద్యాభ్యాసం చేస్తున్నారు.

పాఠశాల నిర్వహణ గ్రాంటు కింద రూ. 1.20 లక్షల వచ్చాయి. దీంతో మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించారు. విద్యుత్ మరమ్మతు పనులు, రచ్చబండలు, పాత్‌వే మరమ్మతు పనులు చేయించారు. విద్యార్థులను ఆకర్షించేలా తరగతి గదులకు రైలు బోగీలులా పెయింటింగ్ వేసి పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. పాఠశాల అభివృద్ధిని చూసి విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ సహకారంతో అభివృద్ధి

మంచి విద్యను అందించడంతో పాటు పరిసరాలు కూడా ఆకర్షించేలా తీర్చిదిద్దితే విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపుతారు. అందుకు అనుగుణంగా పాఠశాలను తీర్చిదిద్దాం. పాఠశాల అభివృద్ధికి తోటి ఉపాధ్యాయులు ఎంతో సహకరించారు. పాఠశాలను మరింత ఉన్నంతగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తాం. – పట్టాసి ప్రసాదరావు, హెచ్‌ఎం లంగుపర్తి ఆశ్రమ బాలురు పాఠశాల

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



రాజవొమ్మంగి ఎస్సీ కాలనీలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న యువత



రాజవరంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిడమర్తి చినబాబు

రాజవొమ్మంగి : స్థానిక ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, ఏజెన్సీలో ఎస్సీలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని నాయకుడు బుజ్జి డిమాండ్ చేశారు. తాతారావు, జీవరత్నం, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో మరో చోట జరిగిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో పెద్దాడ నూకరాజు కేక్ కట్ చేసి, జెండాను ఆవిష్కరించారు. యోహాను, చీడిపల్లి అప్పారావు, శివ, ప్రశాంత్ పాల్గొన్నారు.

గంగవరం : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని, మంద కృష్ణమాదిగ జన్మదినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిడమర్తి చినబాబు ఆధ్వర్యంలో రాజవరం, నెల్లిపూడి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. దండోరా జెండాను వెన్ను వీరబాబు ఆవిష్కరించారు. మండలం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొనగాడ ప్రసాదరావు , ఎన్.వెంకటరావు, బాపిరాజు, చిన్ని, దినేష్ కుమార్, జియ్యంపాలెం మాజీ ఉపసర్పంచ్ సుజాత, జగ్గంపాలెం మాజీ సర్పంచ్ తుర్రం రంగబాబు, తంగెళ్ల వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కి సంతాపం



నక్క అప్పారావు (ఫైల్)

అనంతగిరి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నక్క అప్పారావు ఆదివారం మృతి చెందారు. ఆయన మృతిపై ఎస్‌ఐ కరక రాము, తోటి సిబ్బంది సంతాపం తెలిపారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అప్పారావు విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందారు. స్వగ్రామమైన అనకాపల్లి సాయినగర్‌లోని పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుటుంబానికి ఎస్‌ఐ కరక రాము సానుభూతి తెలిపారు.

రంపచోడవరం వీఆర్‌వో మృతి



గణపతిరెడ్డి (ఫైల్)

రంపచోడవరం: రంపచోడవరం వీఆర్‌వోగా పని చేస్తున్న మిర్తివాడ గణపతిరెడ్డి (46) ఆదివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన చురుగ్గా పనిచేసి అధికారుల మన్ననలు పొందారు. వీఆర్‌వోగా దేవీపట్నం, రంపచోడవరం మండలాల్లో పనిచేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్‌లు వీఆర్‌వో భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ కృష్ణజ్యోతి తదితరులు వీఆర్‌వో మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ మంగా బొజ్జియ్య, రంపచోడవరం డివిజన్ ఏపీఆర్‌ఎస్‌ఏ సభ్యులు అక్రమ్, జిలానీ, రవీంద్ర, యునస్‌బాషా, పాల్‌బాబు,లక్ష్మణ్ సంతాపం తెలిపారు.

ఆశాజనకంగా వేరుశనగ పంట



వారాడలో వేరుశనగ పంట

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో వేరుశనగ పంట ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ సాగులో భాగంగా వందెకరాల్లో సాగు చేస్తున్నారు. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలు వేరుశనగ పంటకు మేలు చేశాయని సాగు రైతులు చెబుతున్నారు. వేరుశనగ విత్తు వేసిన నాటి నుంచి వర్షాలు పడుతుండడం పంటకు ప్రయోజనకరంగా ఉందని అంటున్నారు. కొరువాడ, పాతనవలస, వారాడ, చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, గుల్లేపల్లి, గరుగుబిల్లి గ్రామాల్లో వందెకరాల్లో వేసిన పంట పూతదశకు చేరుకుంది. ఈ దశలో పంటకు ఎకరాకు 200 కేజీలు జిప్సం వేసినట్లయితే గింజలో నూనె శాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు.

ప్రకృతి అందాలు కనువిందు



బందవీధి గ్రామం వద్ద కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల–పాడేరు రోడ్డు మార్గంలో బందవీధి వద్ద ప్రకృతి అందాలు ఆదివారం కనువిందు చేశాయి. వర్షం పడి వెలియడంతో ఆకాశంలో నీలి మేఘాలు, కింద ఆకు పచ్చని మొక్కలతో రమణీంగా ఉన్న దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి.

నూకాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఏర్పాట్లు



జీర్ణావస్థలో ఉన్న నూకాలమ్మ తల్లి ఆలయం

రోలుగుంట: స్థానిక నూకాలమ్మతల్లి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ నిర్మాణం కోసం ఇద్దరు దాతలు లక్ష రూపాయలు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఇక్కడ ఆలయం నిర్మించి 80 ఏళ్లు పైగా కావడంతో జీర్ణావస్థకు చేరుకుంది. ఆలయ నిర్వహణ, అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలను మునిసబ్ కుటుంబీకులు చూసుకుంటున్నాయి. వీరితోపాటు స్థానికులు అల్లు శ్రీను, కొట్టే రమక్క, బణికల దేవుడు, బోయపాడు శ్రీను కమిటీగా ఏర్పడి ఆలయ పునర్నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు దాతల సాయం తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా స్వర్గీయ మడ్డు రామ్మూర్తి నాయుడు తమ్ముడు చిట్టిబాబు, కుమారుడు ప్రసాద్ రూ.50 వేల చొప్పున లక్ష రూపాయలు ఇస్తున్నట్టు ప్రకటించారు. వీరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభ ముహూర్తం మేరకు ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఈ నెల 19న బయటకు తీయడంతోపాటు ఇదే నెల 22న శంకుస్థాపన చేయనున్నారు. భక్తులు సహాయ సహకారాలు అందించాలని కమిటీ వారు కోరారు.

డ్రైనేజీ నిర్మించాలని రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

నర్సీపట్నం: సీబీఎం కాంపౌండ్ సమీపంలో ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద డ్రైనేజీ సదుపాయం లేక చుట్టు పక్కల వారంతా ఇబ్బంది పడుతున్నారని ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకురాళ్లు జి.గౌరీ, కె.వి.సూర్యప్రభ తెలిపారు. తక్షణం డ్రైనేజీ నిర్మించాలని లేదా కళాశాల హాస్టల్‌ను మూసివేయాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకుడు బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి పినారపాలెం కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కళాశాల వద్ద నినాదాలు చేశారు. డ్రైనేజీ నిర్మించాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం చూపకపోవడం శోచనీయమన్నారు.

ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. రోడ్లపై మురుగునీరు నిలిచిపోవటం వల్ల దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గంగాధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అంధకారంలో బస్టాండు



చీకటిమయంగా మాకవరపాలెం బస్టాండు

మాకవరపాలెం: విద్యుత్ లైట్లు లేకపోవడంతో ఆర్టీసీ బస్టాండు అంధకారంలో దర్శనమిస్తోంది. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి నర్సీపట్నం, విశాఖ, అనకాపల్లి ప్రాంతాలకు నిత్యం అధిక సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తాయి. తెల్లవారు 5 నుంచి రాత్రి 10 గంటల వరకు మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు బస్టాండు నుంచే ప్రయాణాలు చేస్తుంటారు. అయితే ఇక్కడ చాలా కాలంగా రాత్రి వేళల్లో లైట్లు వెలగడం లేదు. ఈ నేపథ్యంలో చీకటిలో ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రాత్రి వేళల్లో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ బోనాల మహోత్సవం



బోనాలతో ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు



రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

అడ్డతీగల: మండలంలో వేటమామిడి శివారున వేంచేసి ఉన్న ఊడలమర్రి రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ముర్ల రాజారెడ్డి, సాయిరాం గురూ జీ తదితరుల ఆధ్వర్యంలో వేటమామిడి నుంచి బోనాలు నెత్తిన ధరించి అధిక సంఖ్యలో మహిళలు డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలి వెళ్లారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళలు తమ వెంట తెచ్చిన బోనాలను అమ్మవారికి సమర్పించారు. చిన్న మస్తాదేవికి హోమం నిర్వహించారు.ఆయా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రోడ్డుపై బురదతో వాహనదారులకు అవస్థలు



మొక్కపుట్టుకు వెళ్లే మార్గంలో బురదయంగా ఉన్న రోడ్డు

ముంచంగిపుట్టు: మండలంలో కరిముఖిపుట్టు పంచాయతీ కేంద్రం నుంచి మొక్కపుట్టు వెళ్లే మార్గంలోని దాశరిపుట్టు సమీపంలో రోడ్డు బురదమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతం నుంచి వరదనీటితో పాటు మట్టి కొట్టుకొని వచ్చి రహదారిపై ఉండి పోవడంతో బురదమయంగా మారింది.దీంతో మొక్కపుట్టు,తాంగుల గ్రామాల వాహనాదాలు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి దాశరిపుట్టు సమీపంలో రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించి,రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

శ్రమదానంతో పాఠశాల షెడ్ నిర్మాణం



షెడ్ నిర్మిస్తున్న తంగేళ్లబంద గ్రామస్తులు

అనంతగిరి: మండలంలోని కివర్ల పంచాయతీ తంగేళ్లబందలో గ్రామస్తులు ఆదివారం శ్రమదానంతో తాత్కాలిక పాఠశాల షెడ్‌ను నిర్మించారు. తంగేళ్లబంద గ్రామానికి చెందిన 19 మంది విద్యార్థులు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో గల గంగవరం ఎంపీపీ పాఠశాలలో చదువుతున్నారు. గ్రామ సమీపంలో గల గెడ్డను దాటి వారు పాఠశాలకు వెళ్లాలి. వర్షాకాలం కావడంతో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తమ పిల్లలు పాఠశాలకు వెళ్లలేకపోతున్నారని, గ్రామంలో బడి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గతవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. దీనిపై పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించి, గ్రామంలోని పరిస్థితిని తెలుసుకోవాలని ఎంఈవో కిల్లో బాలజీని ఆదేశించారు. దీంతో ఎంఈవో తంగేళ్ల బంద గ్రామాన్ని సందర్శించి, ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు తాత్కాలిక పాఠశాల షెడ్‌ను ఆదివారం నిర్మించారు. ఇక్కడ ఉపాధ్యాయుడిని నియమించాలని వారు కోరారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి తరలింపు



కొత్తపోలవరం కొండపై గ్రావెల్ తవ్వకాలు

ఎస్.రాయవరం: వీకెండ్ వస్తే చాలు అక్రమ రవాణాదారులు పెట్రేగి పోతున్నారు. ప్రభుత్వం మారి అధికారుల బదిలీల క్రమంలో గ్రావెల్, ఇసుక, మట్టిని జేసీబీలు ఉపయోగించి యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. గుడివాడ శివారు కొత్తపోలవరం వద్ద ఆదివారం జేసీబీ ఉపయోగించి గ్రావెల్ తవ్వుకుని తరలించారు.

అదే క్రమంలో జేవీపాలెం, పేటసూదిపురం, సర్వసిద్ధి గ్రామాల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్న విషయం తెలిసిందే. సోమిదేవపల్లి, దార్లపూడి పరిసర ప్రాంతాల్లో వరహా నది గట్ల వద్ద వీలు కుదిరినప్పుడల్లా ఇసుక తరలించుపోతున్నారు. శని, ఆదివారాలు ఈ దందా మరింత జోరుగా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు దీనిపై దృష్టి సారించటం లేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఈ మేరకు కొత్తపోలవరం గ్రావెల్ తరలింపుపై అధికారులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు తెలిపారు.

క్లాత్ బ్యాగులు వినియోగిద్దాం



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నిర్వాహకులు, చిన్నారులు

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వినియోగించాలని స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఏవీఎస్ మూర్తి కోరారు. మండలంలోని మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదవడం అంటే నాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పిల్లలకు క్లాత్ బ్యాగుల వినియోగంపై అవగాహన కల్పించారు. ముందుగా సంధిందిత కరపత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదన్నారు. అనంతరం భగవద్గీత శ్లోకాలపై భీశెట్టి లక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రీను, నిర్వాహకులు యల్లపు సంజీవరావు, నాగలక్ష్మి, ఆడారి సునీత, భీశెట్టి తులసి, మణి, చదరం రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు



డీఈవో లక్ష్మమ్మ చేతుల మీదుగా మెమెంటో అందుకుంటున్న ఎస్‌వో సరితాదేవి

కోటవురట్ల: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పీఆర్టీయూ సముచిత రీతిన సత్కరించింది. అనకాపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని టాపర్స్, హెచ్‌ఎంలను ఘనంగా సత్కరించారు. డీఈవో లక్ష్మమ్మ సత్కారాలు చేసి మెమెంటోలు అందజేశారు. అదే విధంగా శత శాతం ఫలితాలు సాధించిన కేజీబీవీ ఎస్‌వో సరితాదేవిని ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో లక్ష్మమ్మ సూచించినట్టు సన్మాన గ్రహీత ఎస్‌వో సరితాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్, మండల అధ్యక్షుడు అబ్దుల్లా, కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.